ఎట్టకేలకు సర్కారులో చలనం

ఆహార నాణ్యత పరిశీలనకు టాస్క్‌ఫోర్స్ కమిటీలు

వరుస ఫుడ్ పాయిజన్ ఘటనల నేపథ్యంలో నిర్ణయం

బీఆర్ఎస్ గురుకుల బాట కార్యక్రమంతో కదలిక

హైదరాబాద్,నవంబర్ 28 (నమస్తేతెలంగాణ): రాష్ట్రంలో గురుకులాలు, పాఠశాలల్లో రెండు, మూడు నెలలుగా వరుస ఫుడ్ పాయిజన్ ఘటనల నేపథ్యంలో సర్కారులో చలనం వచ్చింది. ఇన్నాళ్లు చిన్న ఘటనలుగా చూపుతూ నిర్లక్ష్యం చేసింది. విద్యాశాఖను తన వద్దే అట్టిపెట్టుకున్న సీఎం రేవంత్ తూతూ మంత్రంగా సమీక్షించి అధికారులకు ఆదేశాలు జారీచేశారు. అయినా ఈ ఘటనలకు ఫుల్‌స్టాప్ పడనేలేదు. ఇటీవల వాంకిడి గురుకులం, మాగనూరు జడ్పీ స్కూల్‌లో జరిగిన ఫుడ్ పాయిజన్ వరుస ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. 20 రోజులుగా నిమ్స్‌లో చికిత్సపొందుతూ విద్యార్థిని శైలజ మరణించడం సంచలనంగా మారింది. దీంతో గురుకులాలు, సంక్షేమ పాఠశాలల్లో నెలకొన్న పరిస్థితుల పరిశీలనకు గురుకుల బాట పట్టాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సారథ్యంలో ఆంజనేయులుగౌడ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, రాజారాం యాదవ్, వాసుదేవరెడ్డి సభ్యులుగా ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేసింది. దీంతో ప్రభుత్వంలో కదలిక వచ్చింది. ఎట్టకేలకు నిద్రమత్తు వీడిన ప్రభుత్వం ఆహార నాణ్యత పరిశీలనకు టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

సీఎస్ ఉత్తర్వులు

పాఠశాలలు, గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫుడ్‌సేఫ్టీ కమిటీల ఏర్పాటుకు గురువారం సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు. ఫుడ్ సేఫ్టీ కమిషనర్, ఆయా సంస్థల హెచ్‌వోడీలు, జిల్లాస్థాయి అధికారుల నేతృత్వంలో ప్రిన్సిపాల్/వార్డెన్‌తోపాటు మరో ఇద్దరు సిబ్బందితో కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. సభ్యులు ప్రతిరోజూ వంట చేయడానికి ముందు స్టోర్‌రూం, కిచెన్‌ను పరిశీలించాల్సి ఉంటుంది. సంబంధించిన ఫొటోలు తీసి ఉన్నతాధికారులకు పంపించాలి. వండిన ఆహారాన్ని కమిటీ సభ్యులు తిన్న తర్వాతే విద్యార్థులకు పెట్టాలని ఆదేశాలు జారీచేశారు.

పర్యవేక్షణలోపమే అసలు కారణం

గతంలో ఆహార నాణ్యత కోసం ప్రత్యేక కమిటీలు లేకపోయినా.. ఈ బాధ్యతను హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు, వార్డెన్లు చూసేవారు. రోజూ వారు తిన్న తర్వాతే పిల్లలకు భోజనం పెట్టేవారు. ఉన్నతాధికారులు సైతం ఎప్పటికప్పుడూ పర్యవేక్షించేవారు. కానీ ప్రస్తుతం అధికారుల పర్యవేక్షణా లోపం స్పష్టంగా కనిపిస్తున్నది.

పుండుకొకటి.. మందొకటి!

నాణ్యమైన సరుకుల సరఫరా జరగపోవడం, ఏజెన్సీలు ఇచ్చే కమిషన్లకు కక్కుర్తిపడి నాణ్యతలేని సరుకులిచ్చినా పట్టించుకోకపోవడంతో ఆహార కల్తీ ఘటనలు జరుగుతున్నాయని విద్యారంగ నిపుణులు చెప్తున్నారు. కానీ ఇవేమీ పట్టించుకోని ప్రభుత్వం తిరిగి అదే ఉన్నతాధికారుల నేతృత్వంలో ఫుడ్ సేఫ్టీ కమిటీలు వేయడం వల్ల ఒరిగేదేమీ ఉండదని పెదవి విరుస్తున్నారు. నాణ్యమైన సరుకుల సరఫరాపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అంతేగానీ టాస్క్‌ఫోర్స్ కమిటీలతో ఆశించిన ఫలితాలు రావని వారు అభిప్రాయపడుతున్నారు.

రూ.6తో మధ్యాహ్న భోజనమా..?

ప్రాథమిక స్కూళ్లకు రూ. 5.45, హైస్కూళ్లకు రూ. 8.17 ● మార్కెట్లో కోడిగుడ్డు ధర రూ. 7.. ప్రభుత్వం ఇస్తున్నది రూ.5

- ఇటీవల పెరిగిన కూరగాయల ధరలు
- ఫలితంగా కుళ్లిన కూరగాయలు, కుళ్లిన కోడిగుడ్లతో భోజనం
- అరకొర చార్జీలతో కొరవడుతున్న మధ్యాహ్న భోజనం నాణ్యత
- దీంతో రాష్ట్రంలో వరుసగా ఫుడ్ పాయిజన్ ఘటనలు
- తాజాగా చార్జీలను స్వల్పంగా పెంచిన కేంద్ర ప్రభుత్వం
- రాష్ట్రం అదనంగా పెంచుకునే వెసులుబాటు.. అయినా చొరవచూపని రేవంత్ సర్కారు

హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): ఒక 'టీ' విలువ 7 నుంచి 10 రూపాయలు. ఒక టీ విలువతో భోజనం వస్తుందా? అంటే అనుమానమే. కానీ ఒక టీ విలువైన మొత్తంతో మధ్యాహ్న భోజనం అమలవుతున్నది. దీంతో నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. ఈ పథకంలో భాగంగా ప్రాథమిక తరగతుల్లోని వారికి రూ.ఆరు, ఉన్నత పాఠశాలల్లోని వారికి రూ. తొమ్మిది మాత్రమే అందిస్తున్నారు. ఈ ధర గిట్టుబాటు కాక కుళ్లిన కూరగాయలు, కుళ్లిన కోడిగుడ్లను వినియోగించడంతో మధ్యాహ్న భోజనం వికటిస్తున్నది. నారాయణపేట జిల్లా మాగనూరులో పుడ్‌పాయిజన్‌కు కుళ్లిన కోడిగుడ్లను వినియోగించడమే కారణంగా తేలింది. అనేక చోట్ల ఫుడ్ పాయిజన్ ఘటనలు వెలుగుచూస్తున్నాయి. ధరలను పెంచితే నాణ్యమైన భోజనాన్ని అందించే వీలుంటుందని ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

రాష్ట్రం పెంచుకునే వెసులుబాటు..

మధ్యాహ్న భోజన పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నాయి. కేంద్రం వాటాగా 60శాతం, రాష్ట్రవాటాగా 40శాతం నిధులు కేటాయించాల్సి ఉంది. అయితే కావాలనుకుంటే రాష్ట్ర వాటాను పెంచి నాణ్యమైన ఆహారాన్ని అందించే వీలుంటుందని ఉపాధ్యాయ సంఘాలంటున్నాయి. కానీ ఆ దిశగా రేవంత్ సర్కారు దృష్టి సారించడం లేదు. ఇటీవలే హాస్టళ్లల్లోని విద్యార్థుల మెస్, కాస్మెటిక్ చార్జీలను పెంచిన ప్రభుత్వం మధ్యాహ్న భోజన చార్జీలను మాత్రం పెంచలేదు. ఇది వరకు ప్రాథమిక స్కూళ్లల్లో ఒక పూట భోజనానికి రూ.5.45, హైస్కూళ్లల్లో ఒకపూటకు రూ. 8.17 చొప్పున అందజేస్తున్నారు. అయితే ఈ మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం బుధవారం పెంచింది. ప్రాథమిక తరగతులకు రూ. 6.19, హైస్కూళ్లల్లో రూ.9.26కు పెంచారు. పెంచిన ధరలు డిసెంబర్ 1 నుంచి అమల్లోకి వస్తాయని కేంద్రం తెలిపింది.

మెనూ అమలుకావట్లే..

మెనూ ప్రకారం రోజూ రెండు కూరలు పెట్టాల్సి ఉండగా, ఏస్కూళ్లో రెండు కూరలు పెట్టడంలేదు. ఇటీవలే పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతాపసింగారం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తిన్నారు. అయితే రెండు కూరలు ఎందుకు పెట్టడంలేదని ఆరా తీయగా పప్పులోనే కూరగాయలను కలిపేశామని నిర్వాహకులు చెప్పారు. ఇక వారానికి 3 కోడిగుడ్లు పెట్టాల్సి ఉండగా, కొన్నింటిలో అస్సలు ఇవ్వడం లేదు. మరికొన్ని స్కూళ్లల్లో వారానికి ఒకటి రెండు మాత్రమే ఇస్తున్నారు. బహిరంగ మార్కెట్లో గడ్డు ధర రూ. ఏడు ఉండగా, ప్రభుత్వం ఒక గుడ్డుకు రూ. ఐదు మాత్రమే అందిస్తున్నది. భోజన నాణ్యత, రెండు కూరలు, కోడిగుడ్లపై హెచ్‌ఎంలు, టీచర్లు ప్రశ్నిస్తే ఏజెన్సీలు ఎదురుతిరుగుతున్నట్టు టీచర్లు వాపోతున్నారు. మార్కెట్లో కూరగాయల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. ప్రభుత్వం బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో ఏజెన్సీలు చేతులెత్తేస్తున్నాయి.

తింటున్నది 68శాతమే..

రాష్ట్రంలో సర్కారు స్కూళ్లల్లోని విద్యార్థుల్లో 32శాతం విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని తినడం లేదు. మధ్యాహ్న భోజనంపై విద్యార్థులు విముఖత చూపుతున్నారు. ఇంటి నుంచి టిఫిన్‌బాక్స్‌లు తెచ్చుకుని కడుపునింపుకుంటున్నారు. ఇక ఇటీవలి కాలంలో వరుసగా ఫుడ్ పాయిజన్ ఘటనలు వెలుగుచూస్తున్నాయి. దీంతో మధ్యాహ్న భోజనం తినే వారి సంఖ్య మరింత పడిపోనుంది. ఇక రాష్ట్రంలో 27,008 స్కూళ్లుండగా, ఇప్పటి వరకు 3,985 స్కూళ్లకు (15శాతం) మాత్రమే ఎఫ్‌పీజీ కనెక్షన్లున్నాయి. మిగతా బడుల్లో కట్టెల పొయ్యిల మీదే వంట చేస్తున్నారు. చెట్ల కింద వంటచేయడంతో చెట్టుమీదున్న పురుగులు అన్నం, కూరల్లో పడుతున్నట్టుగా క్షేత్రస్థాయి అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

లోకం పోకడ

క్లాస్‌రూమ్‌లను ఆసుపత్రి వార్డులుగా మార్చేశాం!

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	8.8°c	30.0°c
మెదక్	9.5°c	32.3°c
రంగారెడ్డి	10.0°c	32.8°c
నిజామాబాద్	14.3°c	30.4°c
వరంగల్	15.0°c	27.0°c
హైదరాబాద్	16.2°c	29.0°c
మహబూబ్‌నగర్	16.2°c	29.4°c
కరీంనగర్	17.0°c	27.0°c
నల్లగొండ	18.0°c	27.4°c
ఖమ్మం	21.0°c	29.0°c

ముద్దల అన్నం తినేదెలా?

మోత్కూరులో ఆందోళనకు దిగిన విద్యార్థులు ● తినలేక పడేసి పస్తులున్న స్టూడెంట్స్

స్కూల్‌లో అన్నం తినలేక హోటల్‌లో టిఫిన్ చేస్తున్న విద్యార్థులు

మోత్కూరు, నవంబర్ 28 : యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఉడకని అన్నం వడ్డించారు. దీంతో విద్యార్థులు తినలేక పడేసి పస్తులుండాల్సి వచ్చింది. పాఠశాలలో 429 మంది చదువుతుండగా.. గురువారం 363 మంది హాజరయ్యారు. వారికి మధ్యాహ్నం వడ్డించిన అన్నం పూర్తిగా మెత్తగా ముద్దలై గడ్డలు కట్టి పలుకైంది. ఆ భోజనాన్ని విద్యార్థులు తినలేక పడేశారు. ఖాళీ కడుపులతోనే తరగతి గదుల్లోకి వెళ్లారు. ఆకలిని తట్టుకోలేని కొందరు విద్యార్థులు హోటళ్లలో టిఫిన్ చేశారు. మధ్యాహ్న భోజనానికి సరఫరా చేసిన బియ్యం నాణ్యత లేకుండా పురుగులు పట్టి ఉన్నట్టు గుర్తించిన ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌రెడ్డి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. 27న మండల ప్రత్యేకాధికారి యాదయ్య ఆరు క్వింటాళ్ల బియ్యం కొత్తవి తెప్పించారు. అవి కొత్తవి కావడం, నాణ్యత లేకపోవడంతో అన్నం ముద్దగా, గడ్డలు కట్టడంతో విద్యార్థులు తినలేక ఇబ్బందులు పడ్డారు. పర్యవేక్షణ లేకపోవడంతో ఈ దుస్థితి నెలకొన్నదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

ఉడకని అన్నాన్ని తినలేక పడేస్తున్న విద్యార్థులు

ఉడకని అన్నం, నీళ్లచారు మాకొద్దు

ఖమ్మంలో ఎన్నెస్పీ కెనాల్ స్కూల్ విద్యార్థుల ఆందోళన

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 28 : 'ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల చారు మాకొద్దు' అంటూ ఖమ్మం నగరంలోని ఎన్నెస్పీ కెనాల్ పాఠశాల విద్యార్థులు గురువారం ఆందోళనకు దిగారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో ఈ అన్నం తినలేమని, మెనూ ప్రకారం వడ్డించాలని నినదించారు. దీనికి పీడీఎస్‌యూ నాయకులు మద్దతు తెలపడంతో సుమారు 2 గంటలపాటు విద్యార్థులు ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న డీఈవో సోమశేఖరశర్మ పాఠశాలకు చేరుకొని ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులను మందలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మళ్లీ భోజనం వండించి విద్యార్థులకు వడ్డించడంతో వారు శాంతించారు. అధికారులు పర్యవేక్షించి నాణ్యమైన భోజనం అందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

స్కూళ్లలో సదుపాయాలపై తనిఖీలు చేపట్టాలి

విద్యా శాఖకు బాలల హక్కుల కమిషన్ ఆదేశాలు

హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటుచేసిన సదుపాయాల్లో అనేక లోపాలు ఉన్నాయంటూ తమకు ఫిర్యాదులు వచ్చాయని జాతీయ బాలల హక్కుల కమిషన్ తెలిపింది. ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకున్న కమిషన్.. ఈ మేరకు అన్ని పాఠశాలల్లో సదుపాయాలపై తనిఖీలు నిర్వహించాలని రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ కమిషనర్‌కు గురువారం ఆదేశాలు జారీ చేసింది. వెంటనే చర్యలు తీసుకోవాలని, పాఠశాలల్లో జరుగుతున్న సంఘటనలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశించింది.

పుడ్ పాయిజన్లు సీఎంకి పట్టవా?

విద్యాసంస్థలపై నిర్లక్ష్యాన్ని వీడాలి: ఏఐఎస్ఎఫ్

హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాలయాలు, వసతి గృహాలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ విమర్శించారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు, కేజీబీవీ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యతలేని భోజనాలతో పుడ్ పాయిజన్లు జరుగుతూ వందలాది విద్యార్థులు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఏడాది పాలనలో గొప్పగా చేశామంటున్న ప్రభుత్వం.. నిత్యం విద్యార్థులకు పుడ్ పాయిజన్‌లు జరుగుతుండటమే ప్రజాపాలనా? అని ప్రశ్నించారు. ఇంత జరుగుతున్నా సీఎం స్పందించటం లేదని, సమస్య పరిష్కారానికి కనీసం సమీక్ష కూడా చేయటం లేదని తెలిపారు. విజయోత్సవాలపై ఉన్న శ్రద్ధ, విద్యార్థుల అనారోగ్యంపై సమీక్షించేందుకు లేదా అని నిలదీశారు. ప్రభుత్వ విద్యాసంస్థలకు సరఫరా చేసే ఆహార పదార్థాలను ఫుడ్ సేఫ్టీ అధికారులతో తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

మధ్యాహ్న భోజనం తిని నలుగురికి అస్వస్థత

నాగర్‌కర్నూల్ జిల్లా గొరిటలో ఘటన

తిమ్మాజిపేట, నవంబర్ 28 : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం గొరిట ప్రాథమిక పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. మధ్యాహ్నం 12:15 గంటలకు టమాట రైస్, గుడ్డు వడ్డించారు. కాగా మధ్యాహ్నం 3:30 గంటలకు నలుగురు విద్యార్థులు వాంతులు చేసుకోగా.. వెంటనే ఉపాధ్యాయులు వైద్యులను పిలిపించి పాఠశాలలోనే చికిత్స చేయించారు.

గురుకుల విద్యార్థుల పరార్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబర్ 28 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మైనార్టీ బాలుర గురుకులం-3 నుంచి ఇద్దరు విద్యార్థులు పరారైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ముస్తఫా, అహ్మద్ ఈనెల 26న రాత్రి కిటికీ నుంచి దూకి పారిపోయారు. తెల్లవారుజామున విద్యార్థులు కనిపించడం లేదనే సమాచారంతో సీసీ కెమెరాలు పరిశీలించి.. తల్లిదండ్రులకు సమాచారమిచ్చి పోలీసులకు చెప్పలేదు. కాగా పారిపోయిన విద్యార్థులను గుంటూరు రైల్వేస్టేషన్‌లో చైల్డ్‌లైన్ సిబ్బంది, పోలీసులు గుర్తించారు. ముస్తఫా తల్లిని చూసేందుకు గురుకులం నుంచి బయటకు వచ్చినట్టు విద్యార్థులు తెలిపినట్టు సమాచారం.

యూజీసీ, బీసీఐ మార్గదర్శకాల ప్రకారం లా అడ్మిషన్లు

హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): న్యాయ విద్య కోర్సుల్లో అడ్మిషన్లను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. క్యాలెండర్ ప్రకారం అడ్మిషన్లు చేసేందుకు ఇరుపక్షాలు అంగీకరించడంతో పిటిషన్‌పై విచారణను ముగిస్తున్నట్టు ప్రకటించింది. ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సుల్లో కౌన్సెలింగ్‌ను జూలైలోపు పూర్తి చేయకపోవడంపై న్యాయవాది భాస్కర్‌రెడ్డి దాఖలు చేసిన పిల్‌పై విచారణ జరిపింది.

మహబూబాబాద్ జిల్లా కురవి బస్టాండ్ సెంటర్‌లో జాతీయ రహదారిపై ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పుడ్ పాయిజన్‌పై భగ్గుమన్న విద్యార్థి సంఘాలు

- ఉమ్మడి వరంగల్‌లో సీఎం దిష్టిబొమ్మలు దహనం చేసిన విద్యార్థులు
- ఖమ్మంలో ఖాళీ ప్లేట్లతో విద్యార్థుల ర్యాలీ
- సిరిసిల్లలో కొవ్వొత్తులతో ప్రదర్శన

న్యూస్‌నెట్‌వర్క్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): గురుకులాల్లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు మృతి చెందడాన్ని నిరసిస్తూ గురువారం జిల్లాల్లో ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. జనగామ, భూపాలపల్లితో పాటు చిట్యాల, మహదేవపూర్‌లో ఏబీవీపీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలు దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మృతి చెందిన విద్యార్థుల ఉసురు కాంగ్రెస్ ప్రభుత్వానికి తాకుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ప్పటి నుంచి 51 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్, వివిధ కారణాలతో మరణిస్తే ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని మండిపడ్డారు. కాగా మహబూబాబాద్ జిల్లా కురవిలో జాతీయ రహదారిపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా కో కన్వీనర్ జ్యోతి బసు, మండల అధ్యక్షుడు వీరేందర్ మాట్లాడుతూ.. గురుకులాల్లో చనిపోయిన ఒక్కో విద్యార్థి కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు గడుస్తున్నా విద్యాశాఖ మంత్రి లేకపోవడంపై వారు మండిపడ్డారు.

ఖాళీ ప్లేట్లతో విద్యార్థుల ర్యాలీ

ప్రభుత్వ విద్యాసంస్థల్లో అధ్వానంగా ఉన్న మధ్యాహ్న భోజనం, విద్యార్థిని శైలజ మరణం, మాగనూరు పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో వందలాది విద్యార్థులు ఖాళీ ప్లేట్లతో ఖమ్మంలో ర్యాలీ నిర్వహించారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ ఆధ్వర్యంలో పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందించాలని విద్యార్థులు పెద్ద ఎత్తున నినదించారు.

రాష్ట్రంలో విద్యా కమిషన్ పర్యటన

హైదరాబాద్,నవంబర్ 28 (నమస్తేతెలంగాణ): తెలంగాణ విద్యాకమిషన్ రాష్ట్రంలో విస్తృత పర్యటనలకు శ్రీకారం చుట్టింది. చైర్మన్ ఆకునూరి మురళి నేతృత్వంలో కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ విశ్వేశ్వర్, వెంకటేశ్, జ్యోత్స్న నవంబర్ 28 నుంచి డిసెంబరు 7 వరకు జిల్లాలలోని విద్యాసంస్థలను సందర్శిస్తారు. అక్కడ విద్యాప్రమాణాలు, కల్పిస్తున్న సౌకర్యాలు, బోధనాతీరును పరిశీలిస్తారు. విద్యాకమిషన్ పర్యటనకు ఏర్పాట్లు చేయాలని సీఎస్ శాంతికుమారి కలెక్టర్లను ఆదేశించారు. విద్యాకమిషన్ తొలిరోజైన గురువారం వికారాబాద్ జిల్లాలో పర్యటించింది.

కొవ్వొత్తులతో నివాళి

గురుకుల హాస్టళ్లలో మరణించిన 51 మంది విద్యార్థులకు సిరిసిల్ల పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ మాట్లాడుతూ.. గురుకుల హాస్టళ్లలో విద్యార్థుల మరణాలు, వారి సమస్యలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

హాస్టళ్లలో మరణించిన విద్యార్థులకు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ఏబీవీపీ బాధ్యులు

జగిత్యాల జిల్లా పెద్దాపూర్ గురుకులం వంటగదిలో బయటపడ్డ ఎలుక పిల్లలు

పెద్దాపూర్ గురుకులం వంటగదిలో ఎలుకలు

ఆహార నాణ్యతపై అనుమానాలు

మెట్‌పల్లి రూరల్, నవంబర్ 28: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు అందజేస్తున్న ఆహార నాణ్యతపై అనుమానాలు నెలకొన్నాయి. వంటగది ఎలుకల సంచారానికి నిలయంగా మారింది. ఇటీవల అధికారులు గురుకులాన్ని సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. బఠాణీలు, పప్పు, శనగలు పురుగులు పట్టి ఉండడం, బియ్యం సంచులపై ఎలుకల వ్యర్థాలున్నట్లు బయటపడడంతో 4 రోజుల క్రితం కలెక్టర్ సత్యప్రసాద్ గురుకులం ఫుడ్ ఇన్‌చార్జిని సస్పెండ్ చేశారు. బుధవారం వంటగదిని శుభ్రపరుస్తుండగా బియ్యం సంచుల వద్ద ఎలుక పిల్లలు బయటపడ్డాయి. దీనికి తోడు మెనూ ప్రకారం గుడ్లు పెట్టడం లేదని, కూరలు పల్చగా ఉంటున్నాయని, అన్నానికి సరిపడా కూర పెట్టడం లేదని విద్యార్థులు అధికారులకు తెలిపినట్టు సమాచారం.

విద్యార్థులకు పంపిణీ చేయకుండా మహిళా సమాఖ్యలో ఉన్న దుస్తులు

ఏకరూప దుస్తులపై అధికారుల నిర్లక్ష్యం

మూడు నెలలు గడిచినా విద్యార్థులకు అందించని వైనం

మహిళా సమాఖ్య గదులకే పరిమితం

మాగనూరు, నవంబర్ 28 : నారాయణపేట జిల్లా మాగనూరు మండలంలోని 25 పాఠశాలల్లో 3,187 మంది విద్యార్థులు చదువుతున్నారు. అందరికీ ఏకరూప దుస్తులు అందించాల్సి ఉండగా కేవలం 40 శాతం మందికే పంపిణీ చేశారు. కొన్ని దుస్తులను మహిళా సమాఖ్య గదుల్లో వృథాగా పారవేశారు. గురువారం డీపీఎం మాసన్న మాగనూరు మహిళా సమాఖ్యను తనిఖీ చేయగా ఓ గదిలో వెయ్యికిపైగా ఏకరూప దుస్తులు వృథాగా పడి ఉండడంపై ఏపీఎంతోపాటు సిబ్బందిపై మండిపడ్డారు.

బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద

పోలీస్ పహారాలో మాగనూరు పాఠశాల

- మీడియాను సైతం గేటు బయటే అడ్డుకున్న పోలీసులు
- వివరాలు తెలుసుకున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శారద
- పురుగుల అన్నం పెడుతున్నారంటూ విద్యార్థుల ఆవేదన

ఊట్కూర్ (మాగనూర్), నవంబర్ 28 : నారాయణపేట జిల్లా మాగనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలీస్ పహారాలోనే కొనసాగుతున్నది. హైకోర్టు ఆదేశాలతో అప్రమత్తమైన అధికారులు గురువారం పాఠశాలలోకి మీడియాను పూర్తిగా నిషేధించారు. బయటి వ్యక్తులు పాఠశాలలోకి వెళ్లకుండా మెయిన్ గేట్ వద్ద కాపలా ఉన్నారు. గురువారం చేసిన వంటలను మీడియా కంటపడకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. మహిళా సంఘాలకు చెందిన ముగ్గురు మహిళలతోపాటు పాఠశాల సిబ్బందితో వంటలు చేయించారు. అన్నం, క్యారెట్, ఆలుగడ్డతో తయారు చేసిన పప్పు, సాంబారును వడ్డించారు. కాగా, పాఠశాలలో 590 మంది విద్యార్థులు ఉండగా.. కేవలం 270 మంది మాత్రమే హాజరయ్యారు. వారిలో కూడా సగం మంది ఇంటి నుంచే టిఫిన్ బాక్సులు తెచ్చుకున్నారు. పాఠశాలను తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద తనిఖీ చేశారు. పుడ్ పాయిజన్‌కు గురైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అధికారులు, ఉపాధ్యాయులతో సమావేశమై కారణాలు తెలుసుకున్నారు. కిచెన్, స్టోర్‌రూం, వాష్ రూంలను పరిశీలించారు. పదోతరగతి విద్యార్థులతో సమావేశం కాగా, ఉడికీ ఉడకని కూరగాయలతోపాటు పురుగుల అన్నం వడ్డిస్తున్నారని, వాష్ రూంలు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తున్నదని, రోజూ కలుషితమైన నీటినే తాగుతున్నామని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. తాము చిరుతిండ్లు తినలేదని పేర్కొన్నారు. అధికారుల ఆరోపణలన్నీ అబద్ధమని తెలిపారు. అధికారులు దగ్గరుండి విద్యార్థులకు వసతులు కల్పించాలని చైర్‌పర్సన్ ఆదేశించారు. రాజకీయాలతో సంబంధం లేకుండా నాణ్యమైన భోజనం వడ్డించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కాగా, పాఠశాల బయట ఉన్న దుకాణాల్లోనూ సోదాలు జరిపారు.

కాంగ్రెస్‌కు ఓటేసినందుకు చెంపలేసుకుంటున్న!

- రేవంత్ సర్కారు తీరుపై మండిపడ్డ గౌరమ్మ
- ఖమ్మంలో ఏడాది పాలన ప్రచార జాతా
- కళాకారులతో చిరు వ్యాపారి వాగ్వాదం
- కేసీఆర్ ఉంటే అన్నీ ఇస్తుండెనని వ్యాఖ్య
- సోషల్ మీడియాలో వీడియో వైరల్

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): 'ఏం చేసిండమ్మా.. కాంగ్రెస్ ప్రభుత్వం. పింఛన్లు లేవు.. ఏమీ లేవు. బస్సుల్లో అంతా ఆడోళ్లే ఎక్కుతున్నారు' అని భద్రాద్రి కొత్తగూడెం